కథ

# తడబడిన జ్ఞాపకం

సలీం
95886 30243

సాయంత్రం ఐదు గంటల సమయం.. వసారాలో కుర్చీలేసుకుని కూచుని, కాఫీ తాగుతూ.. మా పిల్లల చిన్నప్పటి కబుర్లు కలబోసుకుంటున్నాం. రోజూ మాకిదో వ్యాపకం.. పిల్లలు మాకు దూరంగా ఉన్న బాధనుంచి కొంత ఉపశమనం..

ఇంతలో గేట్ తీసుకుని ఓ పదహారేళ్ల కుర్రవాడు లోపలికొచ్చాడు. మావైపు బెరుగ్గా చూస్తూ..

''ప్రసాద్ గారిని కలవాలండీ'' అన్నాడు.

''నేనే ప్రసాద్‌ని. ఏంటో చెప్పు? ఇంతకూ ఎవర్నువ్వు?'' అని అడిగాను.

''నాపేరు రఘురాం అండీ! నేనూ, మా తాత హైద్రాబాద్ నుంచి ఈ ఉదయమే వచ్చాం''

''ఆ వివరాలన్నీ నాకెందుకు? నాతో ఏం పనో చెప్పు చాలు'' అన్నాను.

''అదే చెప్పబోతున్నానండీ. మా తాత పేరు సత్యవోలు శ్రీనివాసమూర్తి. ఈ ఊళ్లోనే పదో తరగతి వరకు చదువుకున్నాడటండీ. ఆ తర్వాత వాళ్ల నాన్నగారు హైద్రాబాద్‌కి మకాం మార్చడంతో.. ఈ ఊరికి దూరం కావాల్సివచ్చిందట. మా తాతకి ఈ ఊరంటే చాలా ఇష్టమని చెప్పాడు. తన చివరి రోజుల్లో ఓసారి ఈ ఊరిని చూడాలని ఉందని కోరడంతో.. తీసుకొచ్చానండీ'' అన్నాడు.

ఈ ఊళ్లో నేను చదివిన స్కూల్లోనే పదో తరగతి వరకు చదువుకున్నాడని వినగానే నాలో ఆసక్తి కలిగింది.

''పదో తరగతి ఏ బ్యాచో తెలుసా?'' అని అడిగాను.

''తెలుసండీ. 1971'' అన్నాడు.

నాది కూడా అదే బ్యాచ్. కానీ, సత్యవోలు శ్రీనివాస మూర్తి ఎవరో గుర్తుకు రావడం లేదు.

''ఇంతకూ నన్ను వెతుక్కుంటూ ఎందుకొచ్చావు?''

''ప్రసాద్ అనే అతను మా తాతకు బాల్యస్నేహితుడట. పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారట. తన స్నేహితుణ్ని కల్సుకోవాలని తాత కోరిక. అతనితో కలిసి చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలన్నీ మళ్లా తిరగాలని కోరిక''

''ఏ ప్రసాదూ? ఇంటి పేరు ఏమైనా చెప్పాడా?''

''మా తాతకు అతని పూర్తిపేరు గుర్తులేదట. అందుకే ఇప్పటివరకూ ఇద్దరు ప్రసాదుల ఇళ్లకు వెళ్లాం. ఎవ్వరూ తాతను గుర్తుపట్టలేదు. తాత ఇంక నడవలేనంటే.. ఆయన్ని రాములోరి గుడి అరుగులమీద కూర్చోబెట్టి వచ్చాను'' అన్నాడు.

''ఇందాక నువ్వు మీ తాత తన చివరి రోజుల్లో ఈ ఊరు చూడాలనుకుంటున్నట్టు చెప్పావు. చివరి రోజులేంటి? 71లో పది పాసైతే.. నా ఈడు వాడేగా. అరవై ఆరేళ్లుంటాయి'' అన్నాను. ఆ అబ్బాయి మొహంలో విషాదఛాయలు కన్పించాయి.

''మా తాతకు ప్రోస్టేట్ క్యాన్సర్. రెండు మూడేళ్లకు మించి బతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. దానికితోడు ఈమధ్య మతిమరుపు కూడా ఎక్కువైంది'' అన్నాడు.

మా ఇంటికి దగ్గర్లో మూర్తి అనే కుర్రాడు ఉండేవాడు. పదో తరగతి కలిసే చదివాం. మేమిద్దరం ఓ జట్టుగా తిరిగేవాళ్లం. వాళ్ల కుటుంబం కూడా ఇల్లూ పొలాలు అమ్మేసి, హైద్రాబాద్‌కి వెళ్లిపోయింది. ఆ మూర్తి.. ఈ మూర్తి ఒక్కరే కావొచ్చేమో!? అన్పించడంతో..

''మా వీధిలోనే మూర్తి అనే అబ్బాయి వాళ్ల ఇల్లుండేది. ఇంటిపేరు నాకు గుర్తులేదు. ఓసారి మీ తాతను చూస్తే గుర్తు పట్టగలనేమో వెళ్దాం పద'' అన్నాను.

అతని మొహంలో సంతోషం వెల్లువలా పొంగింది.

రామాలయం అరుగుమీద కూచుని ఉన్న మూర్తి.. నన్ను చూడగానే లేచినిలబడి, తన మనవడివైపు మెచ్చుకోలుగా చూస్తూ..

''ఇతనే నా చిన్ననాటి స్నేహితుడు ప్రసాద్'' అన్నాడు. నావైపు తిరిగి..

''ఈ ఊరిడిచిపెట్టి వెళ్లి యాభై యేళ్లు దాటినా నిన్నెలా గుర్తుపట్టానో చూశావా?'' అంటూ కౌగిలించుకున్నాడు.

అతని దుర్బలమైన శరీరం సంతోషాతిరేకంతో అనుకుంటాను.. కొద్దిగా వణకడం గమనించాను.

ఐదడుగుల నాలుగంగుళాలకు మించని ఎత్తు, పల్చటి శరీరంతో మనిషి పిట్టలా ఉన్నాడు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ వల్లనుకుంటాను..

నెత్తిమీద ఒక్క వెంట్రుక కూడా లేదు.

''నీలో చాలా మార్పొచ్చింది మూర్తీ. గుర్తు పట్టలేనంతగా మారిపోయావు'' అతని చేతిని నా చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతూ అన్నాను.

''నువ్వు మాత్రం అలానే ఉన్నావు ప్రసాద్. జుట్టు నెరిసింది అంతే! అందుకే వెంటనే గుర్తు పట్టగలిగాను'' అన్నాడు మూర్తి.

మెల్లగా చీకట్లు ముసురుకోసాగాయి.

''మొదట ఇంటికెళ్దాం. అక్కడ తాపీగా మాట్లాడుకోవచ్చు'' అంటూ మూర్తి చేయి పట్టుకుని.. మా ఇంటివైపు నడవసాగాను. మమ్మల్ని అనుసరిస్తూ రఘురాం..

''నిన్ను కల్సుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది ప్రసాద్. మన స్కూల్, మనం ఆడుకున్న చింతలతోపు, మనం కూచుని కబుర్లు చెప్పుకొన్న చెరువు గట్టు, అక్కడి తాటిచెట్లు, మేం వదిలేసి వెళ్లిన ఇల్లు.. ఇవన్నీ నీతో కలిసి చూడాలన్న కోరిక'' అన్నాడు మూర్తి.

''ఇప్పుడేగా కల్సుకున్నాం. తొందరేముంది? మా ఇంట్లో నాలుగైదు రోజులైనా ఉండాల్సిందే! నువ్వడిగినవన్నీ మెల్లగా చూపిస్తాలే'' అన్నాను.

ఇంటికెళ్లగానే నా భార్యకు పరిచయం చేశాను.

''నా చిన్ననాటి స్నేహితుడు శ్రీనివాసమూర్తి. పదోతరగతి వరకు కలిసే చదువుకున్నాం. ఇన్నేళ్ల తర్వాత నన్ను వెతుక్కుంటూ హైద్రాబాద్ నుంచి వచ్చాడు'' అన్నాను.

